క్లుప్తంగా

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని నంద్యాల జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కామేశ్వర్ రావు తెలిపారు. గురువారం మండల కేంద్రమైన గడివేములలో డెంగీ పాజిటివ్ కేసును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఫ్రైడేను డ్రై డేగా నిర్వహించాలన్నారు. గ్రామంలోని మంచినీటి ట్యాంకులను, డ్రైనేజీలను పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వెంకటేష్ రెడ్డి, ఏఎన్ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం, వాహనాలు, నిందితులను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: సి.బెళగల్ మండలం పల్దొడ్డి, కొత్తకోట గ్రామాల వద్ద గురువారం భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టామన్నారు. మూడు ద్విచక్రవాహనాల్లో తరలిస్తున్న 22 బాక్స్‌ల కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలకల్‌కు నాగరాజు, నాగేష్, మార్కాపురం తిరుమల, రేమట శ్రీనివాసులును అరెస్ట్ చేసి కర్నూలు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.33 లక్షలు ఉంటుందన్నారు. తనిఖీల్లో ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

సి.బెళగల్: ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు, నాయకులతో పాటు ప్రజలు కూడా పాటించాలని ఎంపీడీఓ శకుంతల సూచించారు. గురువారం ఆమె పోలకల్, ముడుమాల, ఈర్లదిన్నె, కే.సింగవరం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పబ్లిక్ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లను సిబ్బందితో తొలగించారు. ప్రజలకు, నాయకులకు ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు.

గతేడాది మూల్యాంకన బకాయిలు చెల్లించాలి

కర్నూలు సిటీ: గతేడాది పదవ తరగతి మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పారితోషకం చెల్లించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రామశేషయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు.

పాఠశాల నిర్వహణపై స్పష్టత ఇవ్వండి

కర్నూలు సిటీ: సాధారణ ఎన్నికల శిక్షణ, పదవ తరగతి మూల్యాంకనం ఒకే రోజు ఉండడంతో పాఠశాలల నిర్వహణకు ఇబ్బందులు వస్తాయని, స్కూల్ నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, రామకృష్ణ గురువారం డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం ఇచ్చారు.

యథావిధిగా తాగునీటి సరఫరా

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని 250 ఎంఎం పైపులైన్‌కు చేపట్టిన మరమ్మత్తులు విజయవంతంగా పూర్తయ్యాయని నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, చంద్రశేఖర్ నగర్, మారుతీ నగర్, బృందావన్ నగర్, సరస్వతీ నగర్, జయరాం నగర్, ధనలక్ష్మీ నగర్, వాసవీ నగర్, బీటీఆర్ నగర్, మాధవీ నగర్, కమల నగర్, శ్రీలక్ష్మీ నగర్, శ్రీనగర్ కాలనీ, ఎన్జీఓ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ (వార్డు నెంబర్లు 19, 20, 21)లకు యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

మహానందిలో పెళ్లిసందడి



పెళ్లి చేసుకునేందుకు గుడిలోకి వస్తున్న పెళ్లిజంట

మహానంది: మహానందిలో గురువారం పెళ్లి సందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన వధూవరులు మహానందీశ్వరస్వామి చెంత ఒక్కటయ్యారు. దేవస్థానంలో ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంతో పాటు ప్రైవేటు కల్యాణ మండపాల్లో పెళ్లిళ్లు జరిగాయి. నూతన వధూవరులతో పాటు బంధుమిత్రులు శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులరద్దీ నెలకొంది.

అడుగడుగునా జననీరాజనం



తమ్మరాజుపల్లె వద్ద రాత్రి 8.52 గంటలకు ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్



ఆర్జీఎం వద్ద సీఎం రాక కోసం వేచి ఉన్న విద్యార్థులు



నంద్యాలలో గురువారం జరిగిన మేమంతా సిద్ధం సభలో పాణ్యం అసెంబ్లీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ప్రజలకు పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- సీఎం జగన్‌కు దారి పొడువునా స్వాగతం
- ఆర్జీఎం వద్ద వేలాదిగా విద్యార్థులు
- అభివాదం చేసి ముందుకు సాగిన సీఎం

పాణ్యం/ఓర్వకల్లు/కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. గురువారం సాయంత్రం నంద్యాలలో 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ ముగించుకున్న సీఎం జగన్.. కర్నూలు జిల్లాకు బయలుదేరారు. ఈక్రమంలో దారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు జగనన్న కోసం రోడ్లపైకొచ్చి స్వాగతం పలికారు. బస్సులో నుంచి జగన్ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. జగన్ చూసిన వెంటనే తమ సొంత కుటుంబ సభ్యుడిని చూసినంత ఆనందంతో ప్రజలు పొంగిపోయారు. అడుగడుగునా జనం ఎదురొచ్చి స్వాగతం పలకడంతో యాత్ర ఆలస్యంగా సాగింది. నెరవాడ మెట్ట వద్ద ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో సాయంత్రం 6.30 జరగాల్సిన ముఖాముఖి కార్యక్రమం రద్దయ్యింది. అక్కడికి రాత్రి 8.40 గంటలకు చేరుకోవడంతో ముఖ్యమంత్రి జగన్ బస్సు దిగి విద్యార్థులకు, ప్రజలకు అభివాదం చేశారు. 2024లో కూడా జగనే సీఎం అంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ మిద్దె శాంతిరాముడు, డైరెక్టర్ మిద్దె శివరాంలు సీఎంకు పూల బొకేలో అందించారు. వారిద్దరిని జగన్ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. పాణ్యం, సుగాలి మెట్ట వద్ద కూడా భారీ ఎత్తున్న మహిళలు రోడ్డుపైకొచ్చి తమ అభిమాన నాయకుడిని చూసేందుకు ఎగబడ్డారు. మహిళలతో కరచాలం చేశారు. తమ్మరాజుపల్లె గ్రామం వద్ద ప్రజలు, చిన్నారులు హైవేపై వేచి ఉండడంతో బస్సులో నుంచి జగన్, ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. సోమయాజులపల్లె వద్ద రెండు నిమిషాల పాటు బస్సులో నుంచే జగన్ అభివాదం చేసి ముందుకు కదిలారు. నన్నూరు బంగ్లా బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి తనయుడు శివనరసింహారెడ్డి, గ్రామ మాజీ సర్పంచు శ్రీరెడ్డి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది ఘన స్వాగతం పలికారు. టోల్ ప్లాజా వద్ద కర్నూలు నగర మేయర్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, సుధాకర్, కర్నూలు, కోడుమూరు అసెంబ్లీ అభ్యర్థులు ఇంతియాజ్, ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. చిన్నటేకూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువత రోడ్డుపైకి వచ్చి సీఎంకు స్వాగతం పలికారు. బస్తిపాడు గ్రామాల్లో ప్రజలు పూలతో స్వాగతం పలికారు. సీఎం బస్సుల్లో నుంచి వారందరికీ అభివాదం చేస్తూ వెళ్లారు. అనంతరం గూడూరు మండలం పెంచికలపాడుకు చేరుకున్నారు.

వైద్యపరికరాల కొనుగోలు



టెండర్లు నిర్వహిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అవసరమైన రూ.కోటి విలువైన వైద్య పరికరాలను శుక్రవారం అధికారులు టెండర్ ప్రక్రియ ద్వారా కొనుగోలు చేశారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా జాయింట్ కలెక్టర్, డిస్ట్రిక్ట్ పర్చేజ్ కమిటీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి కావాల్సిన పలు వైద్యపరికరాల కొనుగోలుకు టెండర్లు నిర్వహించారు. డెక్సా స్కాన్, మూడు అనెస్తీషియా వర్క్ స్టేషన్లు, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలకు రెండు అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్లు, 20 ఏసీల కొనుగోలుకు సంబంధించి టెండర్ బాక్స్‌ను కమిటీ ఆధ్వర్యంలో తెరిచారు. వీటిని కొనేందుకు ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ నిధులను వెచ్చించనున్నారు. కమిటీ చైర్‌పర్సన్ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, సివిల్ సప్లయ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ షర్మిల, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ పాల్గొన్నారు.



గడివేముల నుంచి సభకు వెళ్తున్న అభిమానులు



బయలుదేరుతున్న హుసేనాపురం వాసులు



అలమూరు నుంచి సభకు వెళ్తున్న ప్రజలు

కదం తొక్కిన అభిమానం

- నంద్యాల సిద్ధం సభకు భారీగా తరలివెళ్లిన అభిమానులు, కార్యకర్తలు
- ప్రతి గ్రామం నుంచి బైక్, కార్లు, బస్సుల్లో స్వచ్ఛందంగా బయలుదేరిన జనం



బస్తిపాడు గ్రామంలో మేమంతా సిద్ధం సభకు వెళ్లేందుకు సిద్ధమైన నాయకులు

పాణ్యం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు మండలం నుంచి భారీగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులు బయలుదేరి వెళ్లారు. ప్రతి గ్రామం నుంచి బైక్‌లు, కార్లు, బస్సుల్లో స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఎటు చూసినా వైఎస్సార్‌సీపీ జెండాలతో మండల కేంద్రం కిటకిటలాడింది. గ్రామ సర్పంచ్ మేకల పల్లవి, కరుణాకర్‌రెడ్డి, బాబు, కో- ఆప్షన్ సభ్యులు జాకీర్ హుసేన్, మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు తదితరులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నంద్యాలకు వెళ్లారు.

గడివేముల: మేమంతా సిద్ధం కార్యక్రమానికి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిమానులు నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపు మేరకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ అభిమానులు 50 వాహనాల్లో కదలి వెళ్లారు.

ఓర్వకల్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాలలో నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సామాన్య ప్రజలు భారీగా తరలివెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో మొత్తం 45 బస్సులతో పాటు, ఇతర వాహనాలలో సుమారుగా 5 వేల మంది తరలివెళ్లారు.

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య అన్నారు. గురువారం నంద్యాల జిల్లాలో జరిగిన మేమంతా సిద్ధం సభకు కల్లూరు అర్బన్, కల్లూరు గ్రామీణ ప్రాంతాల నుంచి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.

బస్సు యాత్రకు సర్వం సిద్ధం



పెంచికలపాడు వద్ద సీఎం బస నిమిత్తం ఏర్పాటు చేసిన షెడ్డును పరిశీలిస్తున్న కోట్ల హర్ష, సతీష్

కోడుమూరు/గూడూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు నియోజవకర్గంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా శుక్రవారం ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పర్యటించనున్నారన్నారు. పెంచికలపాడు వద్ద కోడుమూరు రోడ్డులో సీఎం గురువారం రాత్రి బస కోసం ఏర్పాటు చేసిన షెడ్డు, సౌకర్యాలను వారు పరిశీలించారు. శుక్రవారం ఉదయం అక్కడి నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. కోడుమూరు మీదుగా ఎమ్మిగనూరు నియోజవకర్గంలోకి యాత్ర ప్రవేశిస్తుందన్నారు. ఇందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశామన్నారు. సమావేశంలో కోడుమూరు, గూడూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

గూడూరు: జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. గురువారం వారు గూడూరులో పర్యటించారు. శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు భారీగా తరలిరావాలని ప్రజలను కోరారు. అనంతరం మేమంతా సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, సచివాలయ కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు కళామ్, దస్తగిరి, మద్దిలేటి, కుమార్ పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. మంత్రాలయం మండలం నారాయణపురం వద్ద అక్రమంగా తరలిస్తున్న 10 బాక్సుల కర్ణాటక మద్యం (960 ఒరిజినల్‌ఛాయిస్ డీలక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ల)ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు కోసిగికి చెందిన మధుకృష్ణ, నారాయణపురానికి చెందిన ఉరుకుందును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో అక్రమంగా కర్నాటక మద్యం విక్రయించినా, తరలిస్తున్నట్లు తెలిసినా వెంటనే తన సెల్ నెంబర్ 94409 02579కు ఫోన్/మెసేజ్ ద్వారా తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఐదు వాహనాలు సీజ్

కర్నూలు (న్యూటౌన్): నంద్యాల జిల్లా పాణ్యం వద్ద అక్రమంగా మెటల్ రవాణా చేస్తున్న రెండు టిప్పర్లతో పాటు మూడు ట్రావెల్స్ వాహనాలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ తెలిపారు. గురువారం పాణ్యం వద్దర జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా మెటల్ అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకుని సీజ్ చేసి పాణ్యం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.